ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-సీతంపేట

సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 15వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. థియేటర్ అసిస్టెంట్, ఆడియో మెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్, ప్రింటర్ వంటి వివిధ పోస్టులకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు వివరాలకు https://srikakulam.ap.gov.inను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం డిసిహెచ్‌ఎస్ కార్యాలయ నోటీసు బోర్డును కూడా సందర్శించవచ్చని తెలిపారు.

కొమరాడ.. గుమడ రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా అంగన్వాడీలు, సిఐటియు నాయకులను అడ్డుకున్న పోలీసులు

తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమైన అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడింది. అంగన్వాడీల ఉద్యమాన్ని అణచివేత చర్యలకు ఒడిగట్టింది. ఎక్కడికక్కడ అంగన్వాడీలను పోలీసులతో అడ్డుకుని, హౌస్ అరెస్టులకు పాల్పడుతూ పోరాటాన్ని నీరుగార్చేందుకు కక్ష పూరిత చర్యలకు దిగింది. ప్రభుత్వ తీరుపై సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల నిర్బంధాలను ఎదిరించి వేర్వేరు మార్గాల్లో అంగన్వాడీలు విజయవాడ పయనమయ్యారు.

అంగన్వాడీలపై నిర్బంధం

- చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఎక్కడికక్కడ హౌస్‌అరెస్టులు
- ప్రభుత్వ తీరుపై సిఐటియు ఆగ్రహం

ప్రజాశక్తి-కొమరాడ, సాలూరు

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మూడు నెలల పాటు ఇవ్వాలని, తదితర డిమాండ్లపై గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన 42 రోజులపాటు సమ్మె చేసిన విషయం తెలిసిందే. అంగన్వాడీల సమ్మె సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, లోకేష్.. తాము అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు గడుస్తున్నా అంగన్వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. కాలయాపన చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్... సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అంగన్వాడీ కార్యకర్తలు భారీగా బయల్దేరారు. ఈ తరుణంలో ప్రభుత్వం అణచివేత చర్యలకు, నిర్బంధాలకు పాల్పడింది. విజయవాడ రైల్లో వెళ్లేందుకు గుమడ రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న అంగన్వాడీ యూనియన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనురాధ, అంగన్వాడీలు మంగమ్మ, విజయలక్ష్మి, అనురాధ, గంగమ్మ, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తిని మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. గుమడ రైల్వేస్టేషన్‌లో అంగన్వాడీ కార్యకర్తలు పద్మ, భవానిని పోలీసులు నిర్బంధించారు. అంగన్వాడీలపై పోలీసుల నిర్బంధాన్ని సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తి ఖండించారు.

సీతానగరం మండలం నిడగల్లులో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. మక్కువలో అంగన్వాడీ యూనియన్ నాయకులు దాలమ్మను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

అంగన్వాడీలపై నిర్బంధం దారుణం

తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడటం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, జిల్లా నాయకులు కె.ఈశ్వరరావు మండిపడ్డారు. పాచిపెంటలో వారు విలేకరులతో మాట్లాడారు. ఐసిడిఎస్ పిఒలు, పీడీల ద్వారా బెదిరింపులకు దిగడం, పోలీస్ యంత్రాంగాన్ని ఉసిగొల్పి అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. సమాజంలో బెదిరించి ఎంతకాలం ఎవరినీ అణచివేసి ఉంచలేమని స్పష్టంచేశారు. అణచివేసిన పాలకవర్గాలు ఏమయ్యాయో టిడిపి కూటమి ప్రభుత్వం గుర్తుతెచ్చుకోవాలని హితవుపలికారు. 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్‌చేశారు. అణచివేత చర్యలను విరమించుకుంటే భవిష్యత్తులో అంగన్వాడీలకు అండగా అన్ని సంఘాలను కూడగట్టి పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిలక్ష్మిని, మక్కువలో నాయకులు దాలమ్మను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

ఆక్రమణకు గురైన శ్మశానవాటికను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు, ఇందిర

అంత్యక్రియలకూ అవస్థలే

ప్రజాశక్తి-మక్కువ

అంత్యక్రియలకు పడరాని పాట్లు పడుతున్నామని యానాద కుటుంబీకులు సిపిఎం బృందం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు ఉపయోగించే శ్మశానవాటికను వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని మొరపెట్టుకున్నారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని వెంకట భైరిపురం గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటించారు. యానాది వీధిలో స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో నదీ తీరాన తాము వినియోగించే శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని యానాదులు వాపోయారు. దీంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గ్రామస్తులంతా వినియోగించే శ్మశానవాటికను తాము కూడా వినియోగించుకునేందుకు హక్కు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు మాట్లాడుతూ గ్రామస్తుల శ్మశానంలో యానాది కుటుంబాలకు అవకాశం కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అధికారులకు వినతులు అందిస్తామని, అప్పటికీ స్పందించకుంటే పోరాట కార్యాచరణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, నాయకులు పిట్టల చినబాబు, సీతారాం, చంటి, ఎం.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ వసతిగృహంగా మార్చాలి

బలిజిపేట : స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఆర్ఎంఎస్ఎ నిధులతో నిర్మించిన బాలికల వసతిగృహాన్ని ఇంటిగ్రేటెడ్ వసతిగృహంగా మార్చాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు కోరారు. ఆదివారం ఆ వసతిగృహ భవనాన్ని సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంతోపాటు ఇతర మండలాల నుంచి ఇంటర్, పాఠశాల విద్యకు వస్తున్న విద్యార్థులకు ఇది ఒక చక్కని అవకాశమని చెప్పారు. ఈ భవనాన్ని నిర్మించి సుమారు ఆరేళ్లు కావస్తున్నా అధికారులు దీనిపై స్పందించకపోవడం దారుణమన్నారు. లోపల గదులు ఖాళీలుగా ఉండడం, పిచ్చిమొక్కలు పెరిగాయని చెప్పారు. ఐరన్ టేబుళ్లను బయట కుప్పలుగా వేయడం ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగ పరచడమేనని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఎం నాయకులు మన్మథరావు, మురళి, లక్ష్మి, ఈశ్వరరావు, సుధ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పి-4 సర్వే

- వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తరాదు
- అధికారులకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 8 నుంచి జిల్లాలో ప్రారంభమైన పి-4 సర్వేను (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్‌షిప్) పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2.65 లక్షల గృహాలకు సర్వే చేయాల్సి ఉందని చెప్పారు. ప్రతి అధికారి పక్కా ప్రణాళికతో ప్రతి రోజూ సర్వే చేయాలన్నారు. పి-4 సర్వేపై ఇప్పటికే శిక్షణ నిర్వహించినందున, ఎటువంటి అనుమానాలకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలు వారి వృత్తుల రీత్యా ఉదయమే బయటకు వెళ్ళి, సాయంత్రం తిరిగి వచ్చే అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వే చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇళ్ల పేదరికాన్ని అధిగమించి, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న వారి సహకారంతో అట్టడుగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ విధానం అవలంభించనుందని చెప్పారు. ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో ఒక్కొక్కరూ రోజుకు కనీసం 90 వరకు సర్వేలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జూన్ నెలాఖరు వరకు పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను ఇప్పటినుంచే తీసుకోవాలని సూచించారు. ప్రతీ ఎంపిడిఒ, కమిషనర్ వారి పరిధిలోని నీటి కొళాయిలు, బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు ఉన్న చోట తక్షణమే పరిష్కరించాలని స్పష్టంచేశారు. నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయడం, మరమ్మతులు చేపట్టాలన్నారు. పురపాలక పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీలకు కూడా తాగునీటి సరఫరా కావాలని వివరించారు. ప్రతీ వారం తాగునీటి పరీక్షలు చేసి, రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృత పోరాటాలతోనే మహిళలకు విముక్తి

- ప్రజా సంఘాల సదస్సులో ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

విస్తృత పోరాటాలతోనే అణచివేత నుంచి మహిళలకు విముక్తి లభిస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి స్పష్టంచేశారు. ఆదివారం సాలూరు పట్టణంలో ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు, శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకులు గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆర్.శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.రామలక్ష్మి మాట్లాడారు. చిన్నారులు, వృద్ధులు అని తేడా లేకుండా మహిళలపై రోజురోజుకు హింస పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ హింసను అరికట్టే యంత్రాంగం గాని, వ్యవస్థ గాని నేటికీ లేదని చెప్పారు. చట్టాలు ఎన్ని ఉన్నా మహిళలపై జరుగుతున్న దాడులు విషయంలో అవన్నీ నీరుగారుతూనే ఉన్నాయని ధ్వజమెత్తారు. పని ప్రదేశాలలో నేటికీ భద్రత లేదని, ప్రతిచోటా ఏదో ఒక రూపంలో వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు కమిటీలు వేయాలని డిమాండ్‌చేశారు.

అన్యాయం జరుగుతున్న చోట ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. దేశంలో సెన్సార్ సరిగా లేక మీడియాలో విచ్చలవిడిగా సంస్కృతి, సంప్రదాయాలు పక్కన పెట్టి అశ్లీలత రాజ్యమేలుతుందని చెప్పారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పిస్తామని, ఉద్ధరిస్తామని పదేపదే ప్రధాని నరేంద్ర మోడీ వల్లెవేస్తారని, ఆచరణలో మాత్రం చేస్తున్నది ఏమీ ఉండదని విరుచుకుపడ్డారు. మహిళను కించపరిచే పదజాలం, భాష పదేపదే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకత్వం ప్రతి ప్రాంతంలోనూ ఉపయోగిస్తోందని, ఇలాంటి భావనతో ఉన్నవారు మహిళలకు ఏ విధంగా రక్షణ కల్పించగలరని ప్రశ్నించారు.

యుటిఎఫ్ మహిళా నాయకులు రాజమణి, సిఐటియు సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం మహిళా సంఘాలు పోరాడినప్పుడే కొన్ని సమస్యలైనా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలు పోరాడకుండా ఏదీ రాదని చెప్పారు. పెట్టుబడిదారీ సమాజం మూలాలు నేటి సమాజంలో బలంగా వేలూనుకొని ఉన్నాయని, మహిళలంతా ఐక్యంగా ప్రశ్నించేతత్వం అలవర్చుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఆర్‌పి యూనియన్ నాయకులు అన్నపూర్ణ ఎండిఎం నాయకులు సుశీల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగవేణి, రైల్వేస్టేషన్ రోడ్డు కాలనీ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.జానకి రావు, మండల కార్యదర్శి గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు కె.ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నారాయణమ్మ, నిర్మల, డివైఎఫ్ఐ నాయకులు తనూజ్, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

సువర్ణముఖి నదిపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మే నాటికి పూర్తిచేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులను ఆదేశించారు. ఆ బ్రిడ్జి పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్జ, చిన్న అంకలాం మధ్య బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శాసనసభలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షు, కార్యదర్శి పెంట సత్యంనాయుడు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, పెదబాబు, సర్పంచ్ జొన్నాడ తెరీజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు, నాయకులు ఎస్.హరి, గోపాలరావు, తెంటు వెంకట అప్పలనాయుడు, పి.నాగభూషణరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటిడిఎలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించుకోవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని గిరిజనులు గమనించాలని కోరారు.

ప్రభ చెట్టుకు పూజలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పట్టణంలోని మెంటాడవీధికి చెందిన పప్పల గౌరి తోటలో శ్యామలాంబ అమ్మవారి పండగలో ఏర్పాటుచేసే వీరభద్రుని ప్రభ చెట్టును గుర్తించారు. ఆదివారం ప్రభ చెట్టుకు పూజారి జాడ మహేష్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభ చెట్టుకు పూజలు చేస్తున్న పూజారి

'టెన్త్' పరీక్షలకు సర్వం సిద్ధం

- మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు
- జిల్లాను మరోసారి ముందంజలో నిలబెట్టేందుకు ప్రయత్నం
- 'ప్రజాశక్తి'తో డిఇఒ ఎన్.తిరుపతినాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి-పార్వతీపురం

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాను మరోసారి రాష్ట్రంలో ముందంజలో నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు చేపడుతున్న చర్యల గురించి అందులో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....



పదోతరగతి పరీక్షలు జిల్లాలో ఎన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.?

జిల్లాలో పదో తరగతి పరీక్షలను 67 కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. 220 ఉన్నత పాఠశాలలకు చెందిన 10,455 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

పరీక్షలు ఎప్పటినుంచి? సమయం ఏమిటి.?

ఈ నెల 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి.

పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలేమిటి.?

పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించాం. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు చేపట్టాం.

మాస్ కాపీయింగ్ నిరోధానికి తీసుకున్న చర్యలేమిటి.?

పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నిరోధానికి చర్యలు తీసుకున్నాం. నాలుగు పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. మూడు స్క్వాడ్‌లను నియమించాం. అవసరాన్ని బట్టి సిటింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేస్తాం.

పది పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేశారు.?

ఎస్‌సిఇఆర్‌టి మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక రూపొందించాం. అన్ని సబ్జెక్టులకు రోజువారీ పరీక్షలు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్‌లుగా విభజించి వెనుకబడిన సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. ఈ నెల 3 నుంచి 13 వరకు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. రాత్రి వేళల్లో విద్యార్థులు ఎలా చదువుతున్నారో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

పది పరీక్షల్లో గతంలో జిల్లా సాధించిన స్థానం నిలబడుతుందా.?

పదోతరగతి పరీక్షల్లో గతంలో జిల్లా సాధించిన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం రవాణా సౌకర్యం కల్పించారా.?

పదోతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యం కల్పించింది. ఆర్‌టిసి బస్సుల్లో హాల్‌టికెట్ చూపించి, ఉచితంగా ప్రయాణించవచ్చు.

అందని డైట్ బిల్లులు

- 3 నెలలుగా విడుదల చేయని ప్రభుత్వం
- గగ్గోలు పెడుతున్న డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌డబ్ల్యుఓలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు, కెజిబివి, గురుకుల పాఠశాలలు.. మొత్తం.. 71 విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యనభ్యశిస్తున్నారు. 3, 4 తరగతులకు రూ.1050, 6, 7 తరగతులకు రూ.1250, 8, 9, 10 తరగతులకు రూ.1450 చొప్పున నెలకు మెస్‌ఛార్జీల కింద ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ ఛార్జీలతో ఆదివారం గోధుమ పూరి, బంగాళదుంప కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, 10 గంటలకు వేరుశనగ చిక్కి, మధ్యాహ్నం ఒంటిగంటకు చికెన్ బిర్యానీ, రైతా, గోంగూర చట్నీ, రాత్రి ఏడున్నరకు అన్నం, సాంబారు, మజ్జిగ, కూర, అరటిపండు పెట్టాలి. సోమవారం ఉదయం ఏడు గంటలకు పాలు, 8 గంటలకు పులిహోరా, శనగపప్పు పొడి, ఉడకబెట్టిన గుడ్డు, పదిన్నరకు వేరుశనగ చిక్కి, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నం, గోంగూర పప్పు, కూరగాయలతో కూర, పెరుగు, నాలుగున్నరకు ఉడికించిన బఠానీ గుగ్గిళ్లు, రాత్రి భోజనంలో అన్నం, క్యాబేజీ కూర, రసం, మజ్జిగ, జామ్ పెట్టాలి. ఇలా వారానికి రెండుసార్లు చికెన్, ఆరు రోజులు గుడ్డు, ప్రతిరోజు ఇడ్లీ, పూరి, కిచిడి, పాలు, ఆదివారం బిర్యానీ... ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వం ఇచ్చిన మెస్‌ఛార్జీలు తక్కువేనని చెప్పొచ్చు. దాంతోపాటు పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో టీ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఏఒక్కటి కొరత వచ్చినా, సరిగా మెనూ అమలు చేయడం లేదంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు కస్సుబుస్సు లాడటం, మెమోలివ్వడం సర్వసాధారణమే. కానీ మెస్‌ఛార్జీల గురించి మాత్రం వారెవరూ పట్టించుకోవడం లేదు.

బాలుర ఆశ్రమ పాఠశాల

> ప్రభుత్వాలు మారినా పనితీరు మారలేదు. విద్యార్థులకు సకాలంలో కల్పించాల్సిన సౌకర్యాలు, స్కాలర్‌షిప్, డైట్ బిల్లులు చెల్లించడంలో ఎప్పుడూ వెనుకబాటే. కానీ, విద్య కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని మాత్రం బాకాలూదుతున్నారు. ఆశ్రమ పాఠశాలలకు, వసతిగృహాలకు నెలలు తరబడి బిల్లులు అందకపోవడంతో డిప్యూటీ వార్డెన్లు, వసతిగృహ అధికారులు, పాఠశాలల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. డిసెంబర్ నుంచి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వసతిగృహాలు నడిపిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి పెండింగ్

ఇచ్చిన అరకొర మెస్‌ఛార్జీలను కూడా ప్రభుత్వం సరిగా విడుదల చేయడం లేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల డైట్ బిల్లులు అందకపోవడంతో హెచ్‌డబ్ల్యుఓలు, డిప్యూటీ వార్డెన్లు, వసతిగృహాల నిర్వాహకులు అప్పులు చేసి నిర్వహణ సాగిస్తున్నారు. విద్యార్థులకు ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నారు. గిరిజన సహకార సంస్థ ద్వారా కారం రెడ్‌చిల్లి, తెల్లఉల్లి, బెంచి రవ్వ, ఆయిల్, మినప గుళ్ల తదితర సరుకులు సరఫరా చేస్తున్నారు. మిగతా కూరగాయలు, చికెన్ వంటివి బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సి ఉంది. అదే విధంగా గ్యాస్ సిలిండర్ మాత్రం ఏజెన్సీ కార్యాలయంలో ముందుగా నగదు చెల్లిస్తేనే గ్యాస్ డెలివరీ చేస్తారు. లేదంటే చెయ్యరు. దీంతో వసతిగృహాల నిర్వాహకులు నిర్వహణకు అప్పులు చేసి నడపడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెలా బిల్లులు చెల్లించాలని వారు కోరుతున్నారు.

ఎటిడబ్ల్యుఒ వివరణ

డైట్ బిల్లుల గురించి ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి వద్ద ప్రస్తావించగా, నవంబర్ వరకు బిల్లులు చెల్లించామని చెప్పారు. మూడు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆర్‌బిఐ నుంచి విడుదల చేయాల్సి ఉందని సమాధానం ఇచ్చారు.



వారము	పాలు ఉ॥ 7 గం॥లకు	అల్పాహారము ఉ॥ 8.00 గం॥లకు	ఉ॥ పలహారం ఉ॥ 10.30 గం॥లకు	మధ్యాహ్న భోజనం ఉ॥ 1.00 గం॥కు	సా॥ అల్పాహారము సా॥ 4.30 గం॥లకు	రాత్రి భోజనం రా॥ 7.30 గం॥లకు	రాత్రి స్నాక్స్
ఆది	—	గోధుమ పూరి, బంగాళదుంపకుర్మా, ఉడకబెట్టిన గుడ్డు	వేరుశనగ చిక్కి	చికెన్ బిరియాని, రైతా, గోంగూరచట్నీ	సేమియా పాయసం	అన్నం, సాంబార్, క్యారెట్ పెసరపప్పు కూర, మజ్జిగ	అరటిపండు
సోమ	పాలు	చింతపండుతో పులిహోర, శనగపప్పు పొడి ఉడకబెట్టిన గుడ్డు	వేరుశనగ చిక్కి	అన్నం, గోంగూర పప్పు కూరగాయలతో కూర, పెరుగు	ఉడికించిన బఠాణి గుగ్గిళ్లు	అన్నం, క్యాబేజి కూర, రసం, మజ్జిగ	జామ్/ అరటిపండు
మంగళ	పాలు	ఉడక బెట్టిన గుడ్డు, ఇడ్లీ, వేరుశనగ చట్నీ	వేరుశనగ చిక్కి	అన్నం, పాలకూర పప్పు కూరగాయలతో కూర, పెరుగు	రాగి లడ్డు	కొబ్బరి అన్నం, చికెన్ కర్రీ రైతా, గోంగూర చట్నీ	అరటిపండు
బుధ	పాలు	[illegible] అన్నం, కూరగాయలతో కూర, ఉడికించిన గుడ్డు	వేరుశనగ చిక్కి	అన్నం, వంకాయ కూర, మెంతికూర పప్పు పెరుగు	ఉడికించిన అలసంద గుగ్గిళ్లు	అన్నం, బెండకాయ కూర, సాంబార్, మజ్జిగ	జామ్/ అరటిపండు
గురు	పాలు	బియ్యం రవ్వ ఉప్మా, వేరుశనగ చట్నీ, ఉడికించిన గుడ్డు	వేరుశనగ చిక్కి	అన్నం, పాలకూర పప్పు కూరగాయలతో కూర, పెరుగు	మరమరాలు మిక్చర్	అన్నం, చిక్కుడుకాయ కూర, సాంబార్, మజ్జిగ	అరటిపండు
శుక్ర	పాలు	పెసరపప్పు పొంగలి, వేయించిన పచ్చి శనగపప్పు చట్నీ, ఉడికించిన గుడ్డు	వేరుశనగ చిక్కి	అన్నం, పొటాటో కూర, మెంతికూర పప్పు పెరుగు	ఉడికించిన పచ్చిశనగ గుగ్గిళ్లు	అన్నం, గుత్తి వంకాయ కూర, సాంబార్, మజ్జిగ	జామ్/ అరటిపండు
శని	పాలు	ఇడ్లీ, వేరుశనగ చట్నీ	వేరుశనగ చిక్కి	అన్నం, పాలకూర పప్పు, క్యాబేజి కూర, పెరుగు	రవ్వ కేసరి	అన్నం, దొండకాయ కూర, సాంబార్, మజ్జిగ	అరటిపండు

వసతిగృహాల్లో మెనూ ఇలా..

నేడు ఎండిఎం కార్మికుల ధర్నా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎండిఎం కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-బలిజిపేట

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు లక్ష్మమ్మ కోరారు. బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, స్కూల్ స్వీపర్ల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరసాడ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన నిర్వాహకులను రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శతర కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎన్‌వి రమణ, మండలి బుద్ధ ప్రసాద్, సాయికుమార్, తదితరులు

శతర కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

చత్తీస్‌ఘడ్‌లో రాయపూర్ తెలుగు మహా సంఘం నిర్వహిస్తున్న తెలుగు మహాసభలో ఆదివారం ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు రాసిన 'శతర' ఆదివాసీ కవితా సంపుటిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి ఆకుల కళ్లతో మైదానాన్ని చూస్తే .. మైదానం ఆకలి కళ్లతో అడవిని చూస్తోందనీ.. శతర ఆదివాసీ ఆత్మగౌరవ పతాకమని అభివర్ణించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, సినీనటుడు సాయికుమార్, గజల్ గాయకులు శ్రీనివాస్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

ఆటో వివరాలు నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆటోల వివరాలను యూనియన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం సాలూరు పట్టణంలోని అన్ని ఆటో యూనియన్లు, వాటి పరిధిలోని ఆటోలకు ఒకే పట్టణం, ఒకే ఆటో, ఒకే సంఖ్య విధానం అమలు చేస్తూ ఆటోలకు సీరియల్ నంబర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను వివిధ ప్రాంతాల నుంచి వేరొక చోటికి వెళ్లేందుకు ఆటోలను విరివిగా ఉపయోగిస్తారని తెలిపారు. ఈ ప్రయాణంలో ప్రయాణికులకు ఏదైనా ఆపద వస్తే వాటిని గుర్తించడానికి పోలీసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాంటి వాటిని నివారించేందుకు ఆటోల రిజిస్ట్రేషన్‌ను తప్పకుండా ఆటో యూనియన్ నిర్వహించుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్లకు సీరియల్ నంబర్లను అందజేస్తున్న సిఐ అప్పలనాయుడు

'ప్రతిభ'లో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి-సీతంపేట

జోగింపేట ప్రతిభా పాఠశాలలో 8వ తరగతి, మారికవలస, మల్లి ప్రతిభా కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు ఆదివారం సీతంపేట బాలికల గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 8వ తరగతికి సంబంధించి 65 మంది విద్యార్థులకు 58 మంది హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 347 విద్యార్థులకు 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా డి.అరుణజ్యోతి, డి.శ్రీరామ్మూర్తి వ్యవహరించారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- వేపాడ

వాహన ఫిట్నెస్, రెన్యువల్, రిజిస్ట్రేషన్ సేవలను ప్రయివేటీకరిస్తూ వేదాంత ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను గరివిడి మండలం అచ్చుతాపురంలో ఏర్పాటు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్ అన్నారు. మండలంలోని బొద్దాం, సోంపురం, వేపాడ ఆటో కార్మికులతో ఆయన ఆదివారం సమావేశమై ఈ నెల 10న నిర్వహించనున్న కలెక్టరేట్ వద్ద ధర్నా గురించి ప్రచారం చేశారు. అనంతరం గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వేదాంతకి ఇచ్చిన ప్రయివేటు పిటినెస్ సెంటర్‌ను వెంటనే రద్దుచేసి ఆర్‌టిఒ అధికారులే సేవలందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై ఈ విధంగా ఆర్థిక దాడికి పాల్పడడం సరికాదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పద్మనాభం, రామారావు, శంకర్, వెంకటరావు పాల్గొన్నారు.

గజపతినగరం: అచ్చుతాపురంలోని ప్రయివేటు ఫిట్నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఆటో, క్యాబ్, లారీ, వ్యాన్ తదితర మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్లందరూ పాల్గొనాలని శ్రీ మజ్జి గౌరమ్మ, శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కోమటిపల్లి, మానాపురం స్టాండ్ నాయకులు సిహెచ్ అప్పలనాయుడు ఉమామహేశ్వరరావులు కోరారు. ఈ రెండు స్టాండ్‌ల వద్ద ఆదివారం సమస్యలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల రెన్యువల్, రిజిస్ట్రేషన్, ఫిట్నెస్, లైసెన్స్ వంటి సేవలను ప్రయివేటీకరిస్తే ప్రమాదాలు మరింత పెరుగుతాయన్నారు. తక్షణమే పెంచిన ఫీజులు పెనాల్టీల జిఒ 21 రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సిర్లి పోతన్న జాతర

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో సిర్లి పోతన్న జాతర ఆదివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి పోతన్న ఆలయానికి కురుపాంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు తండోప తండాలుగా చేరుకొన్నారు. క్యూలైన్‌లో నిలబడి పోతన్నకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులను తీర్చుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సిర్లి పోతన్న ఆలయం వద్ద క్యూలైన్లో ఉన్న జనం

మృత్యు కూపాలుగా గని బంటాలు

- అడ్డగోలుగా తవ్వకాలు
- నిబంధనలు గాలికి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబిఎం) నిబంధనలు గాలికి వదిలేయడంతో చీపురుపల్లి ప్రాంతంలో పలుచోట్ల మైనింగ్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా తవ్వి వదిలేసిన మైనింగ్ గోతులు మృత్యు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నిబంధనల ప్రకారం మైనింగ్ ఖనిజాల తవ్వకాలు జరిపి వదిలేసిన గని బంటాలను సంబంధిత యాజమాన్యం బాధ్యత వహిస్తూ వాటికి పూర్తిస్థాయిలో రక్షణ కవచం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను సంబంధిత యాజమాన్యాలు గాలికి వదిలేయడంతో పాటు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్లు వదిలేయడంతో సామాన్యుల ప్రాణాలు గని బంటాలలో ఆవిరైపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం ప్రత్యేక కాపలాదారులను కూడా నియమించాల్సి ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

పర్యవేక్షణ లోపం

గనుల శాఖకు సంబంధించిన అధికారులు కూడా ఐబిఎం నిబంధన అమలుపైన నిత్యం పర్యవేక్షణ జరపవలసి ఉన్నప్పటికీ కనీస పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. నిబంధనల ప్రకారం మైనింగ్ జరిగే ప్రాంతంలో ప్రత్యేక రక్షణ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులతో నెలకొకసారైనా సమావేశాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ సమావేశాలు కేవలం రికార్డులకు పరిమితమవుతున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి రక్షణ అంశాలపైన తీసుకున్న చర్యలపైన చర్చలు జరపాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న వాదన వినిపిస్తుంది. నిబంధనలు మేరకు మైనింగ్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాల్సి ఉన్నా మామ్మూళ్ల మత్తులో పర్యవేక్షణ అటకెక్కిపోయినట్లు తెలిస్తోంద.

ప్రమాదకరంగా తవ్వి వదిలేసిన గని బంటా

అనధికారికంగానే..

చీపురుపల్లి మండలంలో నడిపల్లి, ఇటికర్లపల్లి, పేరిపి ప్రాంతాలతో పాటు గరివిడి మండలం కోడూరు, గదబవలస ప్రాంతాల్లో అధికారికంగాను, అనధికారికంగా కూడా మైనింగ్ తవ్వ కాలు చేపడుతుఆన్నరు. ప్రభుత్వ అనుమతులను కొద్దిగా తీసుకొని అంతకు మించి ఎక్కువ స్థాయిలో యథేచ్ఛగా మైనింగ్ తవ్వకాలు జరుపుతుండడంతో ఎక్కువ శాతం గని బంటాలు దర్శనమిస్తున్నాయి. సమీప ప్రాంతాల్లో గల గ్రామాల రైతులు పశువుల మేత కొరకు గని బంటాలు గల ప్రాంతాల్లో సంచరిస్తూ పలుచోట్ల మూగజీవాలతో పాటు రైతులు కూడా మృత్యువాత పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కె.రాములు అనే వృద్ధుడు పేరిపి, ఇటకర్లపల్లి గ్రామాల మధ్య గల సర్వాగి మైనింగ్‌కు చెందిన గుంతలో పడి మృతి చెందడం ఈ ప్రాంత వాసులను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. వర్షాలు పడే సమయంలో మైనింగ్ గోతులు అంచులు కొంచెం కొంచెంగా కరిగి జారిపోతుండటంతో ఆ ప్రాంతంలో సంచరించే మూగజీవాలు సైతం గనిబంటాలలో పడి మృతి చెందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గని బంటాల చుట్టూ రక్షణ కవచాలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అడ్డగోలుగా తవ్వకాలు

మైనింగ్ యాజమాన్యాలు అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నాయి. అనుమతులు తక్కువుకు తీసుకుని వందలాది మీటర్ల లోతులో బంటాలను తవ్వి వదిలేస్తున్నాయి. మైనింగ్ ముడి సరుకు కోసం జరిపిన తవ్వకాలతో ఖనిజం దొరికిన తరువాత వందలాది మీటర్ల లోతులో తవ్వి వదిలేసిన గోతుల్లో పడి మూగ జీవాలతోపాటు సమీప గ్రామాల రైతులు ప్రాణాలను కోల్పోతున్నారు. తవ్వి వదిలేసిన గుంతల చుట్టూ కనీసం ప్రమాద నివారణ రక్షణ చర్య లేకపోవడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు.

గ్రీష్మకు ఎమ్మెల్సీ సీటు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజాంకు చెందిన టిడిపి మహిళా నేత కావలి గ్రీష్మ కు ఎమ్మెల్సీ సీటు వరించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కోటాలో టిడిపి ఆమెకు సీటు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. గ్రీష్మ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించారు. సీటు రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందినప్పటికీ, అధిష్టానం ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విజయానికి కృషి చేశారు. అధిష్టానం ఆదేశాలకు విధేయురాలుగా పనిచేయడంతో పార్టీ గుర్తించింది. ఈ నేపథ్యంలోని ఆమెకు ఎమ్మెల్సీ అవకాశం వచ్చిందని ఆమె సన్నిహితులు, అభిమానులు చెబుతున్నారు. గ్రీష్మ శాసనసభ మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె. తాజా పరిణామాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇద్దరూ ఇద్దరే అన్నట్టుగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశించిన పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణకు నిరాశే ఎదురైంది.

ముగ్గురు సచివాలయ కార్యదర్శులు సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు భాగంగా ముగ్గురు సచివాలయ పరిపాలన కార్యదర్శులను కమిషనర్ నల్లనయ్య సస్పెండ్ చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల మొత్తాలను గరపాలక సంస్థకు సకాలంలో జమ చేయలేదనే విషయమై సమగ్ర విచారణ జరిపించి, ఆ మొత్తాలను తిరిగి నగరపాలక సంస్థకు చలానా రూపంలో కట్టించుకున్న అనంతరం, వారిని విధుల నుండి సస్పెండ్ చేశారు. ఈ ముగ్గురు పరిపాలన కార్యదర్శులు వారు వసూలు చేసిన పన్ను మొత్తాలను నగరపాలక సంస్థ ఖజానాలో జమ చేయలేదన్నారు. 49వ డివిజన్ గాజులరేగ-3, సచివాలయం నెంబర్ 59కు చెందిన పరిపాలన కార్యదర్శిగా ఉన్న ఏనుగుతల ప్రవీణ్ కుమార్ తాను వసూలు చేసిన రు.26,38,238ను నగర పాలక సంస్థకు జమ చేయలేదన్నారు. గాజులరేగ-2 సచివాలయం నెంబరు 58 అడ్మిన్ కార్యదర్శిగా ఉన్న పొట్నూరు మాధురి, గాజులరేగ-1 కు చెందిన 57వ సచివాలయ పరిపాలన కార్యదర్శి కె.సూర్యనారాయణ, 41 డివిజన్ పరిపాలన కార్యదర్శిగా ఉన్న డి.రామకృష్ణ వసూలు చేసిన పన్నుల మొత్తాలను నగర పాలక సంస్థకు జమ చేయలేదని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మక్కువ

ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ కోరారు. ఆదివారం మక్కువ గ్రామ సమీపంలో ఉన్న తోటలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం నుంచి నియోజకవర్గంలోని జనసైనికులంతా తరలిరావాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన సాలూరు, మెంటాడ మండలాల అధ్యక్షులు శివకృష్ణ, రాజశేఖర్, మక్కువ మండల ఉపాధ్యక్షులు సుగుణేశ్వరరావు, మణికంఠ, జగదీష్, తవిటి రాజు, రహీం, అనీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు జాక్సన్

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం పిహెచ్‌సిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. 89 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు జాక్సన్ పరీక్షలు చేశారు. 56 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శస్త్రచికిత్సలకు శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో క్యాంపు మేనేజర్ వెంకటరమణ, క్యాంపు కోఆర్డినేటర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ

ప్రజాశక్తి-సీతంపేట

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించకుంటే ఆడలి వ్యూ పాయింట్‌కు ప్రవేశం లేదని ట్రెయినీ ఎస్ఐ శిరీష, ఎఎస్ఐ సంజీవ్ తెలిపారు. స్థానిక పిఎంఆర్‌సి కూడలి వద్ద ఆదివారం యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. మితిమీరిన వేగంతో వెళ్ళరాదని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహన సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

అరకును రెండు స్థానాలుగా రిజర్వు చేయాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఏడు అసెంబ్లీ స్థానాలతో భౌగోళికంగా పాలనకు ఇబ్బందిగా ఉన్న అరకు పార్లమెంట్ స్థానాన్ని డీ లిమిటేషన్‌లో రెండుగా విభజించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు స్థానాలు గిరిజనులకు రిజర్వు చేస్తూ, ఒకటి మన్యం జిల్లా పార్వతీపురం పార్లమెంట్‌గా, మరొకటి అల్లూరి జిల్లా అరకు పార్లమెంట్‌గా చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర శాఖ కార్యాలయం విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అప్పుడే గిరిజనులకు పాలన చేరువ అవుతుందని తెలిపారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పద్యం, గద్యం, చదరంగం, క్యారంబోర్డు పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో నెల్లిగండి కొండ సమీపంలో ఆదివారం ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. సారా అమ్మినా, తయారుచేసినా కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. సారా నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

బెల్లంఊటను పారబోస్తున్న పోలీసులు